www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి శనివారం పరిశీలించారు. ఎంపిపి పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న మనబడి నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించిన ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అలాగే ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. భీమనపల్లి, విలసవిల్లి, గొల్లవిల్లి గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకంలో మంజూరైన చెరువులను ఎంపిడిఒ గౌరీ కుమారి, ఉపాధి ఎపిఒ వి.రాజామణితో కలిసి పరిశీలించారు. తవ్వతగిన చెరువుల్లోని నీటిని తోడి ఆరబెట్టాలని సూచించారు. చెరువులను పూర్తిగా ఎండబెట్టిన నాడే వేసవిలో ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి పనులు కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఆమె అన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై సిపిఎం ధర్నా

ధరలు తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రం ఎల్పిజి, వాణిజ్య సిలిండర్ల ధరలు పెంచడాన్ని సిపిఎం నాయకులు జిల్లాలో పలు చోట్ల శనివారం ధర్నా నిర్వహించారు. వివరాలు ఇవి..

అమలాపురం కేంద్ర బిజెపి ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ రూ.350 పెంచడాన్ని సిపిఎం జిల్లా కమిటి తీవ్రంగా ఖండిస్తున్నదనీ, పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తోందని సిపిఎం నాయకులు తెలిపారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్లో నిరసన కార్యక్రమాలు జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు పెంచడం దారుణమన్నారు. ఇది పూర్తిగా పేద, మధ్యతరగతిప్రజలపై దాడి తప్ప మరొకటి కాదు అన్నారు. ఉపాధి లేక, వేతనాలు చాలక ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం భారాలు మోపడం దారుణమన్నారు. వంట గ్యాస్ ధరల పెంపును తక్షణం తగ్గించాలని , సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెంచిన ధర ఉపసంహరి ంచేవరకు ఎక్కడికక్కడ నిరసనలు చేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు జిల్లా కమిటి సభ్యులు జి.దుర్గాప్రసాద్, పి.వసంతకుమార్, టి.నాగవరలక్ష్మి, దైవకృప , ఈశ్వరి, అమూల్య, రమాదేవి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **రాజోలు** కేంద్ర బిజెపి పాలకులు తాజాగా మరోసారి పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి పాలకులు సామాన్యులపై నిరంతరం భారాలు మోపుతూ సంపన్నులకు వరాలు కురిపిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా మన దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతూనే ఉన్నారని తెలిపారు. సిపిఎం మలికిపురం శాఖ కార్యదర్శి చవ్వాకుల సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రైవేటు ఆయిల్ కంపెనీల ప్రయోజనాలను తప్ప ఈ పాలకులకు సామాన్యుల గోడు పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయుకులు తాడి సుజాత, సిపిఎం నాయుకులు బళ్ల పర్వతాలు, గోగి సిద్ధార్థ పలువురు పాల్గొన్నారు.**రామచంద్రపురం** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ కె.గంగవరం లో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున ఈ కార్య క్రమం లో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్యులకు మరింత భారం పెంచిందన్నారు. కె.గంగవరం మెయిన్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకూ రాస్తారోకో నిర్వహించారు.అనంతరం మహిళా దినోత్సావాన్ని పురస్కరించుకుని సభ నిర్వహించారు. సభలో మహిళా వివక్ష విడనాడాలి అని, వేధింపులు అరికట్టాలని వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు వెంటపల్లి భిమసంకరం.చీకట్ల వెంకటేశ్వరరావు. మద్ద గౌరమ్మ చెల్లె ధనలక్ష్మి విజయ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



రాజోలులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



కె.గంగవరంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఐ.పోలవరంలో కెవిపిఎస్, సి ఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

ఐ.పోలవరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని మండలం సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు. అధ్యక్షులు జి.గంగభవాని అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని, నిత్యావసరాలు ధరలు కంట్రోల్ చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుకరణ ఉపసరిచుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రం గ్యాస్ ధరను పెంచి ప్రజలపై భారాల మోపిందన్నారు. కార్యక్రమంలో మండలం సిఐటియు సెక్రటరీ కె.నాగలక్ష్మి, కోశాధికారి కె.గంగా రత్నం, ఉపాధ్యక్షులు ఎన్.వెంకటేష్, కెవిపిఎస్ నాయకులు యు.ప్రసాద్, కార్యకర్తలు ఐ.సూరిబాబు, పి. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఐ.పోలవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ప్రజ్ఞా వికాసం'

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంయుక్తంగా పదవ తరగతి ప్రజ్ఞ వికాసాన్ని నిర్వహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పరీక్ష మార్చి 2, 3, 4, 5, 6 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ జిల్లా కమిటీలు నిర్ణయించాయి. అందులో భాగంగా అమలాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల నందు శనివారం టెన్త్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ సిసిఇ మోడల్లోనే 1 మార్కు ప్రశ్నలు ఉంటాయన్నారు. పరీక్షలు రాసిన విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో బహుమతులు అందజేస్తామన్నారు. తెలుగు-10, హిందీ-10, ఇంగ్లీష్-20, మ్యాథ్స్-20, పిఎస్- 10, ఎన్ఎస్.-10, సోషల్-20 చొప్పున మార్కులు ఇవ్వబడ తాయన్నారు. అను భవజ్ఞులైన ఉపాధ్యాయులు, మేధావులు ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రం రూపొందించారన్నారు. విద్యార్థులు మేధస్సును పరీక్షించు కోవడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, విద్యారంగ అభివృద్ధి కోసం సూచనలు, ప్రత్యామ్నాయ విధానాలు సూచిస్తున్నాయన్నారు. ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, పాలిటెక్నిక్ కోచింగ్, మోడల్ ఎంసెట్, 10వ తరగతి ప్రజ్ఞ వికాసాన్ని నిర్వహించడం ద్వారా విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే నిర్వహి స్తున్న పదవ తర గతి ప్రజ్ఞ వికాసానికి విద్యార్థులు హాజరుకావాలన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు కామేశ్వరరావు, బి.గౌతమ్, పి.నరేష్, ఎం.వెంకటేశ్వరరావు, బొక్క రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పర్యవేక్షించారు.



ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

'అన్నంపల్లి' టోల్ వసూలు నిలిపివేయాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

ముమ్మిడివరం నియోజకవర్గం అన్నం పల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన టోల్గేట్ వద్ద టోల్ ఫీజు వసూలు చేయడం ప్రభుత్వం నిలిపివేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎదుర్లంక నుంచి చించినాడ బ్రిడ్జి వరకు ప్రధాన రహదారిని కలుపుకుంటూ ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డు నిర్మాణం అనేక సంవత్సరాలుగా జరుగుతోందన్నారు. అది నేటికీ పూర్తి కాలేదని, బట్టెలంక నుంచి వై.జంక్షన్ వరకు వెళ్లే ప్రధానమైన ప్రాంతంలో ఇంకా నిర్మాణ పనులు చేపడుతున్నారని అన్నారు. కామనగరువు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాలేదన్నారు. పాశర్లపూడి నుంచి చించినాడ వరకు కూడా నిర్మాణ పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో పనులు పూర్తికాకుండా టోల్ ఫీజును ప్రజలపై భారాల మోపుతూ వసూలు చేయడం అన్యాయమన్నారు. రోజువారీగా ప్రజల పైన ఏదో రూపంలో భారాలు వేసే ప్రయత్నం తప్ప ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలే ఆలోచన లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేవన్నారు. ఎదురులంక నుంచి చించినాడ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో అయిన తర్వాత మాత్రమే నామమాత్రపు టోల్గేట్ ఫీజులు వసూలు చేయాలన్నారు. అప్పటి వరకు టోల్గేట్ ఫీజులు వసూలు నిలుపుదల చేయాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడుతామన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గా ప్రసాద్, పి.వసంత్ కుమార్, ముమ్మిడివరం మండల సభిలే సూర్యనారాయణ, పాము బాలయ్య ఉన్నారు.



అన్నంపల్లి వద్ద ఏర్పాటుచేసిన టోల్ ప్లాజా



దుప్పట్లుపంపిణీచేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

వాసవీ క్లబ్ అధ్యక్షునిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం వాసవీ క్లబ్ అధ్యక్షులుగా పేరూరి నాగేశ్వరరావు కార్య దర్శిగా నాగరాజు కోశాధికారిగా వెచ్చ నాగ వెంకట సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. శనివారం ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికల్యాణ మండపంలో సభ్యులందరిచే ప్రమాణస్వీకారం చేయించారు ఈ సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆత్రేయపురం, ఉచ్చిలి, వద్దిపర్రు, తాడిపూడి, వసంతవాడ, వాడపల్లి, లొల్ల గ్రామాల ఆర్యవైశ్యలంతా విచ్చేసి కమిటీ వారిని అభినందించారు.

అంగన్వాడీలు, ఆశాలకు జీతాలు చెల్లించాలి

సిఐటియు నాయకులు మండల మహాసభ

ప్రజాశక్తి-అమలాపురం

అంగన్వాడీ, ఆశా వర్కర్లకు గత మూడు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభు త్వం జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, తక్షణమే జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి .దుర్గాప్రసాద్ అన్నారు. అమలాపురం సిఐటియు మండల మహాసభ ఎంప్లాయిస్ హోమ్లో శనివారం అమూల్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి జి .దుర్గాప్రసాద్ ప్రతినిధిగా హాజరయ్యి దేశంలో కార్మిక స్థితిగతులు వివరించారు. కార్మిక వర్గం అనేక వడిదురుకులు ఎదుర్కొంటున్నారని సరైన ఉపాధి లేక, ఉద్యోగ భద్రత లేక కనీస వేతనం ఎక్కడ అమలు కాక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వక వాళ్ళ కుటుంబాలు ఏ విధంగా పోషించుకోగలరని మండి పడ్డారు. ఏప్రిల్ 3 చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు , కెవిపిఎస్ నాయకులు వసంత్ కుమార్ సోదర సందేశం అందజేశారు. మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా రమాదేవి, కార్యదర్శిగా అమూల్య, కోశాధికారిగా విజయ, మరో 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో మున్సిపల్, బేవరేజ్ హమాలి, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజనం ,భవనిర్మాణ కార్మికులు తదితర సంఘాల నుంచి పాల్గొన్నారు. కార్యక్రమంలో భీమల శ్రీనివాసరావు, చంద్రరావు, ఈశ్వరిదేవి, దయాకృప, సువర్ణ, దుర్గ , డి.ప్రసాద్, ఎం.శ్రీను, కోటేశ్వరరావు, విజయ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

సాగు నీరందక ఇబ్బందులు

ప్రజాశక్తి-కొత్తపేట

సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారాయని, ప్రభుత్వం ముందుగానే గ్రహించి ప్రణాళిక చర్యలు చేపట్టకపోవడం వలన రైతులకు ఇబ్బందులు తలెత్తా యాని రాష్ట్ర రైతు టిడిపి ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ విమర్శి ంచారు. రైతులు పడుతున్న ఇబ్బందులను పంట పొలాలను పరిశీలిం చాలన్న కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బండారు సత్యానందరావు సూచన మేరకు శనివారం మండల పరిధిలోని పలివెలలో టిడిపి నాయకులు రైతులు వద్దకు వెళ్లి పంట పొలాలును పరిశీలించారు. తక్షణమే సాగునీరు అందించాలని పార్టీ నాయకులు డిమాండ్చేశారు. లేదంటే రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు. కొత్తపేట టిడిపి నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



పొలాలు పరిశీలిస్తున్న టిడిపినాయకులు



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కుమారులు

క్రీడలతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

క్రీడలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వైసిపి యువనేత పి.గన్నవరం ఎంఎల్ఎ తనయుడు కొండేటి వికాస్ అన్నా రు. నగరంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను శనివారం ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా యువతకు శారీరక ధారుడ్యంతో పాటు మానసిక వికాసం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు కశిరెడ్డి అంజిబాబు, మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కొండేటి స్టాలిన్, సయ్యద్ హుస్సే న్, నూరైన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.13 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఆలమూరు



నూకాంబిక ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా శనివారం రామచంద్రపురం దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ బాలాజీ రామ్ ప్రసాద్ పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. పసుపు, కుంకుమ అమ్ముకునేందుకు మార్గాని ఏసు రూ.38 వేలకు, కోళ్లు, కొబ్బరి చెక్కలు, అరటి పళ్లు పోగుచేసుకునే హక్కుకుగాను పాలింకి వెంకటేశ్వరరావు రూ.3.25లక్షలు, వారబోయు హక్కుకు వైట్ల శేషబాబు రూ. 3.51లక్షలు, తుల్లుబిళ్ళకు వైట్ల శేషబాబు రూ.2.50 లక్షలు, చీరలు, రవికలు పొగుచేసుకోవడానికి బుల్లిరెడ్డి నూకరాజు రూ.402 లక్షలకు, ఆయా పాటదారులు దక్కించుకున్నారు. దీంతో మొత్తంగా ఈ ఏడాది రూ. 13.66 లక్షలతో అధిక ఆదాయం నమోదయిందని ఇఒ ఉండవిల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, సర్పంచ్ మార్గాని కరుణ ఏసు, ఉప సర్పంచ్ మోరంపూడి వాసు, ధర్మకర్తలు తొంటా సుబ్రమణ్యం, ఈదర నారాయణరావు, పాలంకి ధనవంతరి శర్మ, రోళ్ల శ్రీనివాస్, దొడ్డిపట్ల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

మడ అడవుల సంరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

సముద్రతీర ప్రాంతాల్లో తుఫానులు, ఉప్పెనలు, సునామీలు వంటి ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాలకు రక్షణ గోడలా నిలిచే మడ అడవుల విస్తరణకు చర్యలు తీసుకుంటామని అటవీశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి పి.చలపతి రావు పేర్కొన్నారు. కాట్రేనికోన మండల పరిధిలోని కందికుప్ప ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో శనివారం లైట్ హౌస్ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు బృందం పరిశీలించింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖాధి .కారి ఎమ్వి.ప్రసాద్ రావు మాట్లాడుతూ మడ అడవులను అభివృద్ధి చేసి తీర ప్రాంత సంరక్షణకు అటవీశాఖ ప్రణాళికలు రూపొందించిందని, 1500 ఎకరాల్లో మడ అడవుల అబివృద్ధికి గ్రీన్ క్లయిమెట్ ఫండ్కు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాజమహేంద్రవరం సిసిఎఫ్ చీఫ్ కన్వర్వేటివ్ ఎస్.శ్రీశర్వానన్, ఏలూరు, బాపట్ల, కాకినాడ, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ, మచిలీపట్నం జిల్లాల అటవీ శాఖాధికారులు రవీంద్ర దామా, భీమయ్య, ఐకెవి. రాజు, ఎంవి.ప్రసాదరావు, కె.రాజశేఖర రావుతో పాటు అమలాపురం, కోరింగ, మచిలీపట్నం ఎఫ్ ఆర్ ఒలు హరికుమార్, వరప్రసాద్, సుజాత తదితరులు కాట్రేనికోన మండలంలోని కందికుప్ప శివారు సముద్ర తీరంలో విస్తరించి ఉన్న మడ అడవులు, వాటి పెరుగుదలకు చేపట్టిన చానలింగ్ పనులను పరిశీలించారు. ఒకే ప్రాజెక్టులో చేపట్టిన పనుల్లో భాగంగా ఇతర జిల్లాల అధికారులు ఇక్కడపరిశీలనకు వచ్చారన్నారు. కందికుప్ప సెక్షన్ పరిధిలో 150 ఎకరాలు, రాతి కాలువ సెక్షన్ పరిధిలో 100 ఎకరాలు మడ అడవుల్లో చానలింగ్ పనులు జరుగు తున్నాయన్నారు అనంతరం కందికుప్ప శివారులో ఉన్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని అధికారుల బందం పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ నాగసత్యానారాయణ, సిబ్బంది ఎం.రామిరెడ్డి, ఎ.పట్టాభి, ఎం.సాయి బాబా, లోవ ప్రసాద్, ఎం.వెంకట రమణ, వన సంరక్షణ సమితి చైర్మన్ రేవు బైరవమూర్తి తదితరులున్నారు.



లైట్ హౌస్ ప్రాంతంలో అటవీ అధికారుల బృందం

హౌసింగ్ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామాల్లో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అధికారులు ఆదేశించారు. శనివారం ర్యాలి గ్రామంలో జరుగుతున్న నిర్మాణాల పనులు పరిశీలించారు. హౌసింగ్ నిర్మాణల్లో పురోగతి ఉండాలని లబ్ధిదారులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. వాడపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జరుగుతున్న రోడ్ల నిర్మాణం పనులు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ పరిశీలనలో హౌసింగ్ ఎఇ వి.వెంకట రెడ్డి, వెలుగు ఎపియం, బి.అప్పల కొండ, హౌసింగ్ వర్క్ ఇన్ స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఒ ఎలు, యానిమేటర్లు, డ్వాక్రా సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా..

గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి తలెత్తకుండా సన్నద్ధత, సమగ్ర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. సర్పంచులు, కార్యదర్శులు గ్రామంలో మంచి నీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామంలో పైపు లైన్లు మరమ్మతులు, చేతి పంపు రిపేర్లు, పిడబ్ల్యుఎస్ స్కీమ్డ్ ద్వారా మరమ్మతులు చేయించి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

కార్టూ'నిజం'



పర్ర ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఎస్.యానాం సముద్ర తీరంలోని పర్ర ప్రాంతంలో చేపలు మృత్యువాత పడుతున్న ప్రాంతాన్ని శనివారం మత్స్యశాఖ జెడి షేక్లాల్ మహమ్మద్ పరిశీలించారు. మత్యువాత పడిన చేపలను పరిశీలించిన ఆయన పర్ర భూముల్లోని నాలుగైదు చోట్ల నీటి నమూనాలను సేకరించి ల్యాబ్కు పంపించారు. నీటిలో అమ్మోనియా శాతం పెరగడం ఆక్సిజన్ స్థాయి తగ్గడం చేపలు చనిపోయేందుకు ఒక కారణం అయి ఉండొచ్చనని, అలాగే ఆక్వా చెరువుల కాలుష్యం కూడా కారణం అయి ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకార కుటుంబాలు గత పది రోజులుగా చేపలు మత్యువాత పడుతుండడంతో ఉపాధి కోల్పోయారని గ్రామంలోని ఆయిల్ కంపెని సి ఎస్ ఆర్ నిధులనుండి తమకు సాయం అందించాలని, ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు లంకే శ్రీను, మత్స్యకారులు జెడి లాల్ మహమ్మద్ కు విజ్ఞప్తి చేశారు.



చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న లాల్ మహమ్మద్

నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షునిగా సాయి

ప్రజాశక్తి - పి.గన్నవరం

జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా అడబాల సాయిని నియమిస్తూ ఛైర్మన్ డా.పి.సంపత్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్హెచ్ఆర్సి రాజకీయ నాయ కులకు అతీతంగా పని చేస్తోందన్నారు. ఎక్కడ మానవ హక్కులు ఉల్లంఘన జరిగినా తమ సంఘ సభ్యులు న్యాయ పోరాటంతో ముందుంటున్నారన్నారు. సాయి మాట్లాడుతూ తన ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంపత్కి కృతజ్ఞతలు తెలిపారు.



అడబాల సాయి

బాలబాలాజీని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని హైకోర్టు జడ్జి జోతిర్మయి కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించగా అసిస్టెంట్ కమిషనర్ ఎమ్కెటి.వర ప్రసాద్, ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణలు హైకోర్టు జడ్జి జోతిర్మయి కుటుంబ సభ్యులను శేష వస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. వారి వెంట జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ జడ్జి, అమలాపురం ఆర్డిఒ తదితరులు ఉన్నారు.



చిత్రపటం అందిస్తున్న దృశ్యం

పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలి

ప్రజాశక్తి-మండపేట

గృహసారధులు వైసిపి పాలనను ప్రజలకు చేరువ చేయాలని ఎంఎల్సి తోట త్రిమూర్తులు అన్నారు. తాపేశ్వరం గ్రామంలో మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమంలో భాగంగా అర్తమూరు, తాపేశ్వరం, పాలతోడు, వెలగతోడు, ఇప్పనపాడు గ్రామాలకు చెందిన గృహసారథులతో శనివారం ఎంపిపి వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్సి తోట మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. ఆయన తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, జెడ్పిటిసి సభ్యురాలు కుడిపూడి భవాని, పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గొలుగూరి అన్నపూర్ణ, పిల్లా వెంకటలక్ష్మి, నలమామిడి కపరాజు, ఆర్బికె కమిటీ మండల చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, మండల కన్వీనర్ ఫిల్లా వీరబాబు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యానిమేటర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

భైరవపాలెం పంచాయతీ పరిధిలోని గంగా గ్రామైక్య సంఘం సభ్యులు శనివారం యానిమేటర్ గుర్రం వీరవేణిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఐక్య సంఘంలో 18 డ్వాక్రా గ్రూపు సంఘాలు ఉన్నాయి. ఈ గ్రూపులకు గుర్రం వీరవేణి యానిమేటర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఈ గ్రూపుల నుంచి స్త్రీనిధి, సంఘం మూలనిధి (సిఐఎఫ్) నుంచి ఆర్థిక అవకతవకలకు పాల్పడి రూ.8 లక్షల సొమ్ము స్వాహా చేసినట్లు ఫిర్యాదు చేశారు.

గంజాయితో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ ఇటుక బట్టీలు సమీపంలో 21 కేజీల గంజాయితో ముగ్గురు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు స్థానిక ఇటుక బట్టీలలో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వారిలో ఎక్కువ ధనార్జన చేయాలని దురుద్దేశంతో గంజాయి రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు వారిపై ప్రత్యేక నిఘా పెట్టగా గంజాయితో పట్టుబడగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 21 కిలోల గంజాయిని స్థానిక తహశీల్దార్ ఐపి.శెట్టి, రావులపాలెం సిఐ ఎన్.రజనీకుమార్ సమక్షంలో స్వాధీన పరుచుకుని ముగ్గురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.50 వేల బియ్యం సీజ్

ప్రజాశక్తి-కాకినాడ

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించి శనివారం మూడు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ.50 వేల విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తం పౌర సరఫరాల ఖాతాకు జమవుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6 ఎ ప్రకారం కేసులు నమోదు చేసి, జాయింట్ కలెక్టర్ వారి కోర్టు ముందుంచుతారు.

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వపై కేసు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో సుమారు ఆరువేల కిలోల పిడిఎస్ బియ్యంను ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వచేసిన కేసులో గూడ శ్రీనివాసరావుపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం సివిల్ సప్లై డిటి మున్నంగి జోసెప్ కరణ్ ఆనంద్, రెవిన్యూ సిబ్బంది, విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంటు సిబ్బంది దాడులు చేసి 6000 కిలోల బియ్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన గూడ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సివిల్ సప్లై డిటి జోసఫ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం

రూ.9 లక్షల మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

యానాం నుంచి తుని అక్రమంగా తరలిస్తున్న రూ.9 లక్షల విలువైన అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఇబి ఎఎస్‌పి పి.శ్రీనివాస్ తెలిపారు. యానాం నుంచి భారీ స్థాయిలో అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఒక వ్యాన్‌లో తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. యానాంకు చెందిన నక్కల శ్రీనివాస్, పాయకరావుపేట మండలం పెంటకోటకు బొందు జోగిరాజు, డ్రైవర్లు ఉప్పలగుప్తం మండలం, భీమనపల్లికి చెందిన వల్లూరి వీరబాబు, పలివెల మణికంఠను అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం తీర్థయాత్రలకు వెళ్తున్న భక్తుల టాటా మ్యాజిక్ వ్యానును వెనుకనుంచి హైటెక్ బస్సు ఢీకొనడంతో వ్యాన్లో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. ఆ సమయంలో వ్యాన్‌లో తొమ్మిది మంది ఉన్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సహాయంతో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ ఘటనపై దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పెరవలి, గోకవరం

పెరవలి ఎస్ఆర్ పెట్రోల్‌బంకు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకరపర్రుకు చెందిన బొక్కా వాసుదేవ్ (20), పంపన శ్రీరాములు శుక్రవారం రాత్రి 10:30 గంటల సమయంలో కాకరపర్రు నుంచి బైకుపై పెరవలి వైపు బయలుదేరారు. వారు పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి చీకటిలో నిలిపిన లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వాసుదేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శ్రీరాములును వైద్యం నిమిత్తం తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన పండా వెంకన్నదొర (50) శుక్రవారం రాత్రి రామన్నపాలెం వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో వెంకన్న దొర అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాగునీటిపై ఆశలు.. వంటింట్లో మంటలు..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తడంతో రైతులు తమ ఆశలు ఆవిరవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో డ్రెడ్జింగ్ పనులు చేపట్టకపోవటంతో నీటి నిల్వ శాతం తగ్గిపోయిన విషయం విదితమే. మరో వైపు కాల్వల పూడికతీత, ఆధునీకరణ పనులు చేపట్టకపోవటంతో శివారుకు నీరు పారే పరిస్థితులు కన్పించడం లేదు. సాగునీటి సలహా మండలి సమావేశంలో రబీసాగుకు నీటి ఎద్దడి లేకుండా సాగునీరు అందిస్తామని అధికార యంత్రాంగం హామీ ఇచ్చిన విషయం విదితమే. అధికార యంత్రాంగం ఇచ్చిన హామీతో జిల్లా వ్యాప్తంగా రైతులు సాగు ఆరంభించారు. ప్రస్తుతం అనేక మండలాల్లో వరి పంట పొట్టదశలో ఉంది. ఈ పరిస్థితుల్లో కాల్వలలో నీటి సరఫరా మందగించింది. మరో వైపు ఎండలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. దీంతో పంట పొలాలకు సకాలంలో నీరందించకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు సానుకూలంగా స్పందించి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్ నెలలో కాల్వలకు నీరు సరఫరా నిలిపివేసి పూడికతీత పనులు చేపట్టడం పరిపాటి. ఈ పనులకు సంబంధించి ఫిబ్రవరి లేదా మార్చిలో టెండర్లు పిలుస్తుంటారు. ఈ ఏడాది టెండర్ల ప్రక్రియ ప్రారంభానికి నోచుకోకపోవటంతో రైతన్నలను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం పూడికతీత, ఆధునీకరణ పనులపై దృష్టి పెట్టకపోతే ఎలా అనే ప్రశ్న తలెత్తుతోంది.



గ్రాసిమ్ విస్తరణకు ప్రజల విముఖత

గ్రాసిమ్ ఇండస్ట్రీస్ విస్తరణకు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతమయ్యింది. గతవారంలో బలబద్రపురం హైస్కూల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన విషయం విదితమే. ఈ కార్యక్రమం నిర్వహణ నేపథ్యంలో ముందు రోజు పోలీసులు పెద్ద ఎత్తున అక్కడ గ్రామంలో కవాతు నిర్వహించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. కాలుష్య కారకమైన గ్రాసిమ్ సంస్థ అక్కడి ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి విస్మరించిందని ప్రజలు గుర్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు ధైర్యంగా తమ వాణిని వినిపించారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పిస్తామంటూ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోకపోవటం ప్రధాన కారణమని తెలుస్తోంది. అంతే కాకుండా గ్రాసిమ్ సంస్థ సంవత్సరానికి 30 వేల టన్నుల బొగ్గును మండిస్తూ కాలుష్యానికి కారణమవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా కాలుష్య నివారణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని కలెక్టరుకు వివరించారు. కలెక్టరు సానుకూలంగా స్పందించి కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థలకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

మార్చిలోనే మొదలైన మంటలు

ఏటా మేలో భానుడు తన ప్రతాపం చూపటం పరిపాటి. అయితే ఈ ఏడాది రెండు నెలల ముందుగానే మంటలు మొదలయ్యాయి. వాతావరణ శాఖ ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించిన విషయం విదితమే. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత క్రమ క్రమంగా పెరుగుతోంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సరాసరిన 38 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. మరో వైపు కనిష్ట ఉష్ణోగ్రతలు 21 డిగ్రీల సెల్సియస్ నుంచి 23 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమవుతోంది. దీంతో రాత్రి వేళల్లో చలి తీవ్రత తగ్గడంలేదు. ఉష్ణోగ్రతలలో మార్పులు అనారోగ్యాలకు కారణమవుతోంది. ప్రతి ఐదు కుటుంబాలలో ఒకరికి జలుబు లేదా దగ్గు వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. దీంతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గడిచిన వారం రోజుల్లో గణనీయంగా ఔట్ పేషెంట్ల సంఖ్య పెరిగింది. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను మరింత బలోపేతం చేసి నాణ్యమైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు

వంటింట్లో గ్యాస్ మంటలు

బిజెపి ప్రభుత్వం మరో సారి గ్యాస్ ధరను మండించడంతో వంటిల్లు భగ్గుమంటోంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే ధరల బండ మోపింది. తాజా పెంపుతో 14 కేజీల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెరగటంతో సుమారు రూ.1,174కు చేరింది. వాణిజ్య సిలిండర్ రూ.350 పెరగటంతో రూ.1769 నుంచి రూ.2,119కి చేరింది. జిల్లాలో నెలకు దాదాపు 7.50 లక్షల గ్యాస్ సిలిండర్ల వినియోగం ఉంటుందని ఒక అంచనా. దీంతో అక్షరాలా రూ.3.5 కోట్ల భారం పడిందని తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ల ధర పెంపు చిరువ్యాపారులకు గోరు చుట్టుపై రోకలి పోటులా మారిందని చిరు వ్యాపారులు వాపోతున్నారు. సామాన్యుల నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తున్నా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రశ్నించిన దాఖలాలు కన్పించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనసేన సైతం అదే బాటలో పయనించటం ఆ పార్టీ శ్రేణులను కలవరానికి గురి చేస్తోంది. సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు మాత్రమే నిత్యం ప్రజల్లో ఉంటూ ధరల పెరుగుదలను నియంత్రించాలని పోరాటాలు చేస్తున్నాయి.

ఏడుగురికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబికులకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఏడుగురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

18 ఏళ్ల లోపు పెళ్లి నేరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల లోపు వివాహం చేయడం నేరమని జిల్లా బాల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు పేర్కొన్నారు. శేషాద్రి నగర్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'బేటీ బచావో- బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి సంబంధమని, మేనరికమని కారణాలతో ఆడుతూ పాడుతూ చదువుకునే వయసులో 18 ఏళ్లలోపు అమ్మాయిలకు వివాహం చేయడం సామాజికంగా, ఆరోగ్యపరంగా పలు సమస్యలకు కారణమన్నారు. చిన్న వయసులోనే గర్భం వస్తే ప్రసవ సమయంలో ప్రాణానికి ప్రమాదమని, పిల్లలు కూడా బలహీనంగా పుట్టే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లలోపు అమ్మాయికి వివాహం చేస్తే ఉభయ పక్షాలతో పాటు పెళ్లి కుదిర్చిన వారిని, పెళ్లికి హాజరైన వారికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉన్నందున బాల్య వివాహాలు చేయరాదని వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు


కల్యాణోత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

ఘనంగా మీసాల వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన యానాం వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక బాలాలయం వద్ద స్వామి వారి కళ్యాణాన్ని ప్రముఖ వేదపండితులు వాడపల్లి గోపాలాచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు, రుత్వికులు కనులపండువుగా జరిపించారు. చింతా వెంకట సుబ్బారావు కుమాంలు పూజల్లో పాల్గొన్నారు. యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, లక్ష్మీ స్నేహ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు సమర్పించారు. పరిపాలనాధికారి మునిస్వామి దంపతులు, ఎస్‌పి రఘునాయగం, డిటి సత్యనారాయణ, కమిషనర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తుల సీజ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ తమ సిబ్బందితో డైరీ ఫారం సెంటర్‌లో ఉన్న కిరాణా షాపుల్లో శనివారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఫుడ్ ఇన్ స్పెక్టర్ నాగూర్ మీరా పలు రకాలైన పొగాకు సంబంధిత ప్యాకెట్లు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తుని పట్టణానికి చెందిన ఒక వ్యాపారి కాకినాడ సాంబమూర్తి నగర్‌కు చెందిన మరో వ్యాపారి సహకారంతో విమల్, జర్దా, మీరజ్, రాజా ఖైనీ వంటి పొగాకు సంబంధిత నిషేధిత ఉత్పత్తులను కర్ణాటకలో కొనుగోలు చేసి తునిలో నిల్వ చేస్తున్నారు. కాకినాడ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి- కరప

గురజానపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు ఎస్ఐ నౌడు రామకష్ణ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. రూ.35 వేల నగదు, ఐదు బైకులను స్వాధీనం చేసుకుని జూదరులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్


అవగాహన కల్పిస్తున్న జెడిఎ విజయకుమార్

రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించు కునేలా గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్ సూచించారు. శనివారం సామర్లకోట వ్యవసాయ విత్తనోత్పత్తి అనుసరణీయ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు వ్యవసాయ శాఖ ఎడిఎ జివి పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించిన పొలంబడి శిక్షణ కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. దాళ్వా పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పురుగులు మరియు తెగుళ్ల లక్షణాల గుర్తింపు మరియు వాటి అధిక నష్ట పరిమితి స్థాయి మిత్ర పురుగుల గుర్తింపు, వివిధ రకాల శత్రు పురుగులను అంతం చేసే మిత్ర పురుగుల అధ్యయనం, తెగుళ్ల మరియు పురుగుల ఉధతికి దోహదపడే వాతావరణ పరిస్థితులు, గట్లపై కలుపు నివారణ యొక్క అవశ్యకత గూర్చి వివరించాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. వరి పంటలో సమగ్ర సస్య రక్షణ సమగ్ర పంటల యాజమాన్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో సాగుచేస్తున్న పంట పొలాలను పరిశీలించి, ఆయా అంశాలపై గ్రూపుల వారీగా రివ్యూ చేసి జెడిఎ పలు సూచనలు ఇచ్చారు. ఎడిఎ పద్మశ్రీ, మండల వ్యవసాయ అధికారులు చీకట్ల సత్యనారాయణ, టివిఆర్.మణిదీప్, ఇమ్మిడిశెట్టి సత్య, హబ్ మేనేజర్ ఎంకెవి లక్ష్మి, ఎఇఒలు, మూడు మండలాలకు చెందిన విఎఎలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు నాయకుల చేరిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బిసి నాయకులు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో వారికి ఎంఎల్ఎ చినరాజప్ప పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి చురుకుగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు నిమ్మకాయల రంగనాథ్, పార్టీ నాయకులు చల్లా సత్యనారాయణ (బుజ్జి), పి.చంద్రశేఖర్, జి.గణేష్, కె.ముసలయ్య, పి.సత్తిబాబు, పి.రమణ, కె.శ్రీను, వి.శివ గణేష్, జి.రాజు, జి.సత్తిబాబు పాల్గొన్నారు.

సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాజోలు

ఎనిమిది సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్న సువర్ణ ఇండియా భాదితులకు న్యాయం చేయాలని సువర్ణ ఇండియా బాధితుల సంఘం అధ్యక్షుడు కాశీ వెంకట్రావు కోరారు. శనివారం రాజోలు అంబేద్కర్ భవనం నందు సువర్ణ ఇండియా బాధితుల సమావేశం జరిగింది. ఈ సంద్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇప్పటికే రెండు సార్లు ఎపి సిఎం జగన్‌కు సువర్ణ ఇండియా బాధితులంతా మెమెరాండం సమర్పించామని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ప్రభుత్వం సీజ్ చేసిన భూములను స్వాధీనం చేసుకుని సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సువర్ణ ఇండియా బాధితుల సంఘం కార్యదర్శి కానూరి తులసీ రావు, కొంబత్తుల అనిల్, నాగాబత్తుల వెంకటరమణ, జి. కష్ట, జి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ సామగ్రి అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక 41వ డివిజన్‌లోని యువతకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) భవాని ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆట వస్తువులు అందచేశారు. గతంలో ఈ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో స్థానిక యువకులు కంబాలపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న మున్సిపల్ మైదానంలో ఆడుకునేందుకు ఆట సామగ్రి, అమ్మ వారి ఆలయం వద్ద కూర్చునేందుకు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయలని కోరారు. వారి అభ్యర్థనపై స్పందించిన ఆదిరెడ్డి వాసు తమ ట్రస్టు ద్వారా ఆట వస్తువులు, సిమెంట్ బల్లలను సమకూర్చారు. ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు తామెప్పుడూ ముందుంటామన్నారు. తమ ట్రస్టు తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చుక్కా నూకరాజు, అన్నవరం, మళ్ల వెంకటరాజు, వింజమూరి సత్యనారాయణ, సింహా వెంకటేష్, వానపల్లి శ్రీనివాస్, మోతా పండు, దొండపాటి రాజు పాల్గొన్నారు.

బిసి హాస్టల్‌లో ఆదిరెడ్డి తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక వై.జంక్షన్ సమీపంలోని బిసి బాలుర వసతిగృహంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు టిడిపి నాయకులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలు నెలకొన్నాయని, వసతిగృహం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడం లేదనే విషయాన్ని తెలుసుకున్న ఆయన దీన్ని సందర్శించారు. వంట గది, రీడిరగ్ రూమ్, మరుగు దొడ్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమస్యలు పరిష్కరించే వరకూ తమ పార్టీ నాయకులతో కలిసి వసతిగృహం వద్ద బైటాయిస్తామని హెచ్చరించారు. ఇటీవల ఒక విద్యార్థి సెలవు చీటీ ఇవ్వలేదని వార్డెన్ కొన్ని రోజులుగా అన్నం పెట్టడం లేదన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉందని, మరుగుదొడ్లకు తలుపుల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రీడింగ్ రూమ్‌లో టైల్స్ చిధ్రమై విద్యార్థులు కూర్చోలేకపోతున్నారని, లైట్లు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. తమ భవాని ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆదిరెడ్డి వాసు ట్యూబ్ లైట్లను సమకూర్చారు. ఆయన వెంట నాయకుల మజ్జి రాంబాబు, నక్కా దేవీవరప్రసాద్, మెహబూబ్ జానీ, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బొర్రా చిన్ని, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విజయవాడ స్మృతివనంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం పక్కనే జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జిల్లా నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సృజనరావు మాట్లాడారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వంపై డిమాండ్ చేస్తూ ఈనెల 24న విజయవాడలోని గాంధీనగర్ ఐలాపురం కన్వెన్షన్ హాల్ వద్ద ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దళిత గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ యార్లగడ్డ వెంకటరత్నం, ఎస్.గిఫ్ట్‌బాబు, చీలి సురేష్, చెట్టే మధు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ శాతం పెంపునకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

వివిధ సబ్ ప్లాన్ల ద్వారా మంజూరు చేసిన సబ్సిడీ లోన్ల బకాయిలు అధికంగా ఉన్నాయని, రికవరీ శాతాన్ని త్వరితగతిన వృద్ధి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.శామ్యూల్ సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో మండల ఇంచార్జ్ ఎపిఎ మందపల్లి ధనరాజు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.ఉమాశ్రీ అధ్యక్షతన సమీక్షా సమావేశం శనివారం ఆయన నిర్వహించారు. ముందుగా సమావేశ ముఖ్య అంశాలు చర్చించారు. ప్రాజక్ట్ ప్రాధాన్యతా అంశాలైన జగనన్న తోడు, బ్యాంక్ లింకేజీ రుణాలు మొదలగు అంశాలలో లక్ష్యాలను, అచీవ్మెంట్ పై చర్చించారు. స్కూల్ డ్రాపౌట్ చిల్డ్రన్, బాల కార్మికులు, బాల్య వివాహాలు హరికట్టడంలో స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పాత్ర వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సిసిలు సుబ్బారావు, భీమరాజు, అకౌంటెంట్ కుమార్, గ్రామ సంఘం విఒఎలు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న దాతలు

బాలిక వైద్యానికి దాతల సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని గణేష్ కాలనీకి చెందిన ముద్రగడ్డ యేసు రాజు కుమార్తె అరుణ కుమారి ఇటీవల ఆనారోగ్యానికి గురైంది. బాలికను వైద్యం కోసం హైదరాబాదుకు తరలించగా డాక్టర్లు చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని, దీని నిమిత్తం రూ.4.50 లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ. 5 వేలు పెదపళ్ల సొసైటీ అధ్యక్షులు నెక్కంటి వెంకటరాయుడు రూ. 5 వేలు మొత్తం కలిపి శనివారం రూ.10 వేలు అందజేసి వారి కుటుంబాన్ని ఓదార్చారు.


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో శ్రీనివాసరావు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలతో బాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని ఇఎమ్‌బిపి డిఎం ఉదయకుమార్ అన్నారు. స్థానిక ఎస్‌విఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎంట్రీ ప్రిన్యూరల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రత్యేక శిక్షణ తరగతులను ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఇఎమ్‌బిపి డిఎం ఉదయకుమార్ శనివారం పరిశీలించారు. కార్యక్రమలో ట్రైనర్ ప్రసాద్, శ్రీనివాసరావు, ఇన్చార్జ్ హెడ్ మాస్టర్ ఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి కల్యాణం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో వేణు గోపాల స్వామి దివ్య కల్యాణం వైభవంగా జరిగింది. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఆలయ చైర్మన్ కట్టా రామచంద్రమూర్తి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల యాత్రికులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎఎస్‌బిజె.రామలింగం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

సిఎం జగన్ పవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన బాధ్యత గృహసారథులపైనే వుందని కౌన్సిలర్ మున్సిపల్ చీఫ్ విప్ వాడ్రేవు సాయి ప్రసాద్ అన్నారు. యనమదల గ్రామంలో కన్వీనర్లు గహ సారథులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సిఎం పని చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు గహ సారథులను, సచివాలయ కన్వీనర్లను నియమించారన్నారు. ఇంటింటికి పథకాలు చేరేలా చూడాలని చెప్పారు. అందుకు అందరూ సమిష్టిగా కషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన వెంకట రమణ, ఎంపిటిసి సభ్యుడు రామకష్ణ, కన్వీనర్లు కుక్కల గోవిందు, పెయ్యల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు టిడిపి తరుపున కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో వాంబే గృహాలను టిడిపి నాయకులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఏకరువుపెట్టారు. సక్రమమైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. సెప్టిక్ ట్యాంకుల సమస్యలను కూడా ఆయన దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళలు విన్నవించిన సమస్యలను నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు బుడ్డిగ రాధాకృష్ణ, టిడిపి డాక్టర్స్ సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, మాజీ కార్పొరేటర్ గొర్రెల రమణి తదితరులున్నారు.